
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
కర్ణాటక వార్తలు
మంగళవారం 6 మే 2025



రోగ లక్షణాలను గుర్తించే యాప్

బెంగళూరు, మే 5(ఆంధ్రజ్యోతి): రోగలక్షణాలను గుర్తించే హైదార్ మొబైల్ యాప్‌ను మైసూరుకు చెందిన జీర్ కార్డియోడిజీ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో రూపొందించారు. ఈ యాప్‌తో అనువైన చికిత్స పొందే అవకాశం ఉంటుంది. యాప్‌లో ఆఫ్‌లైన్ అండ్ ఆన్‌లైన్ రెండూ వ్యవస్థలు ఉండడం విశేషమని సంస్థ ఎండీ, సీఈఓ డాక్టర్ డేవిడ్ జె చెల్లి అభిప్రాయపడ్డారు. మధుమేహం, రక్తపోటు ఇటీవలకాలంలో అధికమయ్యాయన్నారు. ఆరోగ్యరక్షణ రంగంలో కీలకమైన ఈ యాప్ వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు.



సోలార్ ప్యానెళ్లతో వ్యవసాయ పంప్‌సెట్



అన్నదాతకు తొలగిన అడ్డంకులు..!

- వ్యవసాయ పంప్‌సెట్లకు సులభంగా కనెక్షన్లు.. నాణ్యమైన విద్యుత్ సరఫరా
- అనధికార మోటర్లకు చెక్ ● సౌరమిత్రతో సోలార్ పంపుల అందజేత

బెంగళూరు, మే 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్నదాతలు పంటలసాగుకోసం ఏర్పాటు చేసుకున్న పంప్‌సెట్లకు దశాబ్దాల కాలంగా విద్యుత్ సరఫరాలో ఉన్న అడ్డంకులను సంపూర్ణంగా తొలగించే ప్రక్రియ ప్రారంభమయ్యింది. పంటలసాగుకోసం రైతులు వారికి అనుకూలంగా బోరుబావులను తవ్వుకుంటారు. అయితే విద్యుత్ సమకూర్చే విషయంలో సంబంధితశాఖ పెట్టే ఇబ్బందులకు తల్లడిల్లుతుంటారు. అందుకే ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేసుకునేందుకు అన్నదాతలు కుస్తీ పడుతుంటారు. కొన్ని ప్రాంతాల్లో అక్రమంగా విద్యుత్ కనెక్షన్‌లను ఏర్పాటు చేసుకుంటుంటారు. ఇదేం కొత్త కాకపోయినా దశాబ్దాలకాలంగా అక్రమంగా బోరుబావులకు అనుమతులు లేకుండా విద్యుత్ ప్రక్రియ కొనసాగుతోంది. దీనికై విద్యుత్‌శాఖ సరికొత్త ప్రతిపాదనలు తీసుకొచ్చింది. విద్యుత్‌స్తంభాలు ఉండే ప్రాంతాల్లో వెంటనే అనుమతులు జారీ చేసి త్రీఫేజ్ విద్యుత్ అందించాలని నిర్ణయించారు. విద్యుత్‌లైన్లకు 500 మీటర్లకంటే దూరంగా ఉంటే సోలార్ పంప్‌సెట్లను అమర్చుకునేలా సూచిస్తున్నారు. గత ప్రభుత్వం వ్యవసాయ బోరుబావులకు మౌలిక సదుపాయాలు కల్పించింది. ఆ తర్వాత విద్యుత్ కనెక్షన్ అవసరమంటే రైతులు సొంత ఖర్చుతో ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. విద్యుత్‌శాఖ ప్రమేయం లేకుండా నేరుగా రైతులు విద్యుత్ కనెక్షన్ పొందాలంటే రూ.5 నుంచి రూ.6 లక్షల రూపాయలు భరించాల్సి ఉంటుంది. బోరుబావుల తవ్వకానికే రూ.2-3 లక్షలదాకా ఖర్చు పెట్టే రైతులు విద్యుత్ కనెక్షన్ కోసం అంత మొత్తం భరించలేమని అన్నదాతలు తిరగబడ్డారు. ప్రస్తుతం కొత్తగా కనెక్షన్ కావాలంటే అవసరమైన పరికరాలు సమకూర్చేందుకు ఎస్టిమేట్ ఇస్తారు. అంతమేర నగదును చెల్లిస్తేనే కొత్త కనెక్షన్‌ను సమకూరుస్తారు.

అక్రమ కనెక్షన్లకు చెక్ పెట్టేలా..

విద్యుత్‌లైన్లకు 500 మీటర్లకంటే దూరం ఉండే బోరుబావులకు స్టాండ్‌లోన్/అఫ్‌గ్రిడ్ సోలార్ పంప్‌సెట్లను కచ్చితంగా ఏర్పాటు చేసుకునేలా ఆదేశించారు. ప్రధానంగా ఇలా రెండు విధానాలు అమలు చేయడం ద్వారా ఏళ్ల తరబడి అక్రమంగా కొనసాగుతున్న కనెక్షన్‌లను నియంత్రించాలనేది విద్యుత్‌శాఖ ఆశయంగా ఉంది. త్వరితగతిన కనెక్షన్‌లు సమకూర్చడం, అప్‌గ్రేడ్ కనెక్షన్‌లు ఏర్పాటు చేయడంతో ట్రాన్స్‌ఫార్మర్‌లను సాంకేతికంగా అభివృద్ధి చేయనున్నారు. పాత పంప్‌సెట్లను తొలగించి కొత్తపంప్‌సెట్లను సమకూర్చుకోవడం రైతుల బాధ్యతగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లు, వాటికి తగ్గట్టుగా కనెక్షన్స్ ఇవ్వడం, విద్యుత్‌లైన్లు, స్తంభాలను మార్చడం వంటివి ప్రక్రియ చేపట్టదలిచారు. విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలంటే అన్నదాత ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలి, విద్యుత్‌శాఖ ఎంతమేర భరిస్తుంది, ఏ విధమైన సౌలభ్యాలు కల్పిస్తుందనేని అసిస్టెంట్ ఇంజనీర్లు అంచనా వేస్తారు. టెక్నో ఎకనమిక్ ఫీజిబిలటీ ప్రకారమే కొత్త కనెక్షన్‌లు మంజూరు చేస్తారు.



సగం అక్రమ కనెక్షన్లే..

2014 జులై ప్రకారం త్వరితగతిన కనెక్షన్‌లను మంజూరు చేసేవారు. వాటి ప్రకారం రైతులు రూ.10వేలు డిపాజిట్ చెల్లిస్తే వారికి అనుకూలంగా ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్‌లైన్లు, స్తంభాలు సమకూర్చేవారు. 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను ఎస్కాంలు సమకూరుస్తాయి. 2023 సెప్టెంబరుకి ముందు విద్యుత్ సరఫరాకు సంబంధించి మౌలిక సదుపాయాలు కల్పించాలని దరఖాస్తు చేసుకున్నారు. ఇలా 4.5 లక్షల అర్జీల్లో సగం సక్రమ కనెక్షన్‌లు ఉన్నాయి. 37,999 కనెక్షన్‌లు 500 మీటర్లకు దూరంగా ఉన్నాయి. 29వేల సౌర విద్యుత్ పంప్‌సెట్లకు దరఖాస్తు చేసుకున్నారు. 2023 సెప్టెంబరు తర్వాత ఆటోమేటిక్ విధానంతో విద్యుత్ కనెక్షన్లకోసం 28వేలమంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నారు.

సౌరమిత్రలో పెరిగిన నమోదు..

సోలార్ నీటి పంప్‌సెట్లకోసం సౌరమిత్ర పథకం కింద 29వేలమంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లకు 500 మీటర్లకంటే దూరంగా ఉండే వాటిని గుర్తించేందుకు ఎస్కాంలు సర్వే చేస్తున్నాయి. వారు నివేదిక సమర్పించాక కంపెనీల ద్వారా అర్హులైన రైతులకు సోలార్ ప్యానెళ్లతోపాటు ఇతర పరికరాల అమరిక ఆదేశాలు జారీ చేస్తారు. పేర్లు నమోదు చేసుకున్న దరఖాస్తులపైకి 500 మీటర్ల కంటే దూరం ఉండేవి 2,500 దాకా పంప్‌సెట్లు ఉండవచ్చునని ప్రాథమికంగా గుర్తించారు. కేంద్రప్రభుత్వం పీఎం కుసుమ్-బీ కింద 40వేల సోలార్ వాటర్‌పంప్‌సెట్లను మంజూరు చేసింది. గరిష్టంగా 7.5 హెచ్‌పి స్టాండలోన్ సోలార్ సౌకర్యాలు కల్పిస్తారు. ప్రతి విభాగానికి కేంద్రప్రభుత్వం 30శాతం, రాష్ట్రప్రభుత్వం 50శాతం రాయితీ కల్పిస్తుండగా 20శాతం అన్నదాతలు భరించాల్సి ఉంటుంది. రైతుల పంప్‌సెట్లకు సకాలంలో విద్యుత్ సమకూరడం లేదని తద్వారా బోరుబావుల్లో నీరు ఉన్నా పంటలసాగు చేయలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. పైగా త్రీఫేజ్ కరెంటు వచ్చేవేళ ట్రాన్స్‌ఫార్మర్లలో లోడ్ పెరగడంతోనూ తరచూ బ్రేక్ డౌన్ అవుతుంటాయి. ఇలాంటి ఇబ్బందులు ఇప్పుడే కొత్తకాకున్నా కొన్నేళ్లకాలంగా సమస్య ఉంది. వీటన్నింటికీ చెక్ పెట్టేలా కొత్త విధానాన్ని తీసుకురానున్నారు.



సులభంగా పొందేలా..

రైతులకు జారీ చేసే అనుమతలు వద్ద నుంచి ప్రతి దశలోనూ ఆధునికత అమలు చేయనున్నారు. ప్రత్యేక అధికారుల ద్వారా రైతులకు అనుమతులు జారీ చేయనున్నారు. దీంతో అన్నదాతకు సులభంగా పంపుసెట్ల అనుమతి రావడంతోపాటు సమయం, నగదు ఆదా కానుందని చెప్పవచ్చు. 2023 సెప్టెంబరుకు ముందు తగిన ఫీజు డిపాజిట్ చెల్లించి విద్యుత్ కనెక్షన్ పొందని రైతులు ఆసక్తి చూపితే హెచ్‌టీ, ఎల్‌పీ నెట్‌వర్క్ విస్తరణ పనులు సొంత ఖర్చుతో ఏర్పాటు చేసుకోవచ్చు. విద్యుత్ కంపెనీల ఖర్చుతో ట్రాన్స్‌ఫార్మర్‌లు అమర్చి 2 లేదా అంతకంటే ఎక్కువ పంప్‌సెట్లకు కలిపి విద్యుత్‌ను సమకూరుస్తారు. 2023లో పేర్లు నమోదు చేసుకుని విద్యుత్ కంపెనీలకు రూ.15వేలు డిపాజిట్ చెల్లించిన రైతులకు అవసరమైన కనెక్షన్లను, తదితర సౌలభ్యాలను సమకూరుస్తారు. దీనిద్వారా రైతులు దళారులను ఆశ్రయించకుండా సులభంగా కనెక్షన్ పొందే అవకాశం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



మీడియాతో మాట్లాడుతున్న సీఎం సిద్దరామయ్య, పక్కనే డీసీఎం డీకే శివకుమార్

2 నెలల్లో ఎస్సీ వర్గీకరణ అమలు

- ఎన్నికల హామీని నెరవేరుస్తాం ● రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన ఉపకులాల సర్వే: సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, మే 5(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలో ప్రకటించినట్లు ఎస్సీ వర్గీకరణ రెండు నెలల్లో అమలు చేస్తామని సీఎం సిద్దరామయ్య తెలిపారు. ఎస్సీ కులాల సమగ్ర సర్వే 2025కు సంబంధించి విధానసౌధలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మీడియాతో మాట్లాడారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి నాగమోహన్‌దాస్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేశామన్నారు. కమిషన్ నివేదిక సమర్పించిందన్నారు. ఎస్సీ సామాజికవర్గంలో 101 ఉపకులాలు గుర్తించామని శాస్త్రీయంగా వర్గీకరణ చేసేందుకు గణాంకాలు సేకరిస్తున్నామన్నారు. 2011లో కులగణన ఆధారంగా సదాశివ కమిషన్ ఎస్సీ కులాల జనాభాను గుర్తించిందన్నారు. 2024 ఆగస్టులో సుప్రీంకోర్టు సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగానే సర్వే జరుపుతున్నామన్నారు. ఆదిద్రావిడ, ఆది కర్ణాటక, ఆది ఆంధ్ర వర్గంలో ఎంతమంది ఉన్నారనేది నిర్ధారణ కావాల్సి ఉందన్నారు. ఈనెల 17వరకు సర్వే కొనసాగుతుందన్నారు. మొబైల్ యాప్ ద్వారా సర్వేకు అవకాశం ఇచ్చామన్నారు. ఉదయం 6.30 గంటలనుంచి సాయంత్రం 6.30 వరకు సర్వేకు అవకాశం ఉందన్నారు. ఎన్నికల హామీలో ప్రకటించామని, అందుకు అనుగుణంగాన వర్గీకరణ సర్వే జరుపుతున్నామన్నారు. సమావేశంలో మంత్రులు మహదేవప్ప, మునియప్ప, శివరాజ్‌తంగడగి, శివానందపాటిల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్, ఎమ్మెల్యే రూపశశిధర్, ఎమ్మెల్సీలు సుధామదాస్, నజీర్ అహ్మద్‌లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలవి అసత్య ఆరోపణలు..!

- అంబేడ్కర్ ఓటమికి డాంగే కారణమని నిరూపిస్తే.. రాజకీయాలకు గుడ్‌బై: ప్రతిపక్ష నేత చలవాది సవాల్



మాట్లాడుతున్న చలవాది నారాయణ స్వామి

బెంగళూరు, మే 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేతలవి అబద్ధాల ఆరోపణలని, రాజ్యాంగనిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఎన్నికల్లో ఓడించింది కాంగ్రెస్ పార్టీ కాదని, కమ్యూనిస్టు పార్టీకి చెందిన డాంగే, ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన సావర్కర్ అంటూ కాంగ్రెస్ అగ్రనేతల వ్యాఖ్యలపై పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణ స్వామి మండిపడ్డారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం సిద్దరామయ్య, జైరాం రమేశ్, మంత్రి ప్రియాంకఖర్గేల వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ నలుగురు నాయకులు తమ వ్యాఖ్యలను రుజువు చేస్తే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి రాజకీయాలకు గుడ్‌బై చెబుతానని సవాల్ విసిరారు. వారి వ్యాఖ్యలకు కట్టుబడితే తన వేతనంలో లక్ష రూపాయలు బహుమతిగా ఇస్తానన్నారు. వారు విఫలమైతే నలుగురూ రాజకీయాలకు గుడ్‌బై చెబుతారా..? అంటూ సవాల్ విసిరారు. మల్లికార్జున ఖర్గే, ఆయన కుమారుడు ప్రియాంక ఖర్గేలు డబుల్ ఇంజన్ అబద్ధాల కోరులన్నారు. ఖర్గే నుంచి అంబేడ్కర్, దళితులకు అన్యాయం జరిగిందన్నారు. 65ఏళ్లపాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌కు ఎందుకు న్యాయం చేయలేదని ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని కాపాడడం మా హక్కు అని కాంగ్రెస్‌వారు గొప్పలు చెబుతారని, అంటే మిగిలినవారికి రాజ్యాంగరక్షణవైపు లేరా అంటూ ప్రశ్నించారు. రాజ్యాంగరక్షణ దేశప్రజలందరి హక్కు అన్నారు. రాజ్యాంగంతోనే టీ విక్రయించిన నరేంద్రమోదీ ప్రధాని అయ్యారన్నారు. కాంగ్రెస్‌వారు ఇలాంటివి మాట్లాడరన్నారు. రాజ్యాంగం కొన్ని వేల సంవత్సరాలక్రితం వచ్చిందని రాహుల్‌గాంధీ వ్యాఖ్యలను పరిశీలిస్తే అతడికి బుద్ధి ఎక్కడుందో అన్నారు. రాహుల్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు ఎందుకు స్పందించలేదన్నారు. రిజర్వేషన్లపై బీజేపీ వ్యతిరేకించిందని చెప్పుకొనే ఖర్గే అధికారంలో 60ఏళ్ల ఉన్నది ఏ పార్టీ అని ప్రశ్నించారు. బీహార్‌లో సభకు జనం రాలేదంటే అక్కడి కాంగ్రెస్ అధ్యక్షుడని సస్పెండ్ చేశారని, ఇది గులాంగిరీ విధానం కాదా...? అంటూ ప్రశ్నించారు. మంగళూరులో హిందూ కార్యకర్త సుహాస్‌శెట్టికి సోషల్‌మీడియాలో హతమారుస్తామనే బెదిరింపులు వచ్చినా..? మీకు ఎలాంటి రక్షణ ఇవ్వమని, కారు, ఇంట్లో ఎటువంటి ఆయుధాలు ఉంచుకోరాదని పోలీసు అధికారులు చెప్పడం న్యాయం కాదన్నారు. పోలీసు అధికారులు రక్షణ కల్పించకుండా హంతకులకు సమాచారం ఇచ్చినట్లు అయ్యిందన్నారు. మరో ఇద్దరు హిందూ కార్యకర్తలకు బెదిరింపులు వచ్చాయని వారికి పోలీసులు ఏ విధమైన రక్షణ కల్పించారని ప్రశ్నించారు. రాష్ట్రంలో పాలనా వైఫల్యం, శాంతిభద్రతలు దెబ్బతిన్నాయన్నారు. కేపీఎస్‌సీ సభకు రిటైర్డు అధికారి అతీక్‌కు ఏం సంబంధమన్నారు. సభకంటే ముందుగానే ఓ హోటల్‌లో రాత్రివేళ 4 గంటలపాటు అతీక్ చర్చలు ఎలా జరుపుతారన్నారు. అతీక్‌పై అభిమానం ఉంటే సిద్దరామయ్య ముఖ్యమంత్రి పదవిని ఆయనకే కట్టబెట్ట వచ్చునని వ్యంగ్యం చేశారు.

రౌడీషీటర్ దారుణ హత్య

- రాజీకి పిలిచి హతమార్చిన ప్రత్యర్థులు



కార్తీక్ (ఫైల్)

బెంగళూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): మైసూరు నగర శివారులోని ఓ హోటల్ వద్ద ఆదివారం రాత్రి పొద్దుపోయాక క్యాతమారనహళ్ళి నివాసి రౌడీ షీటర్ కార్తీక్ (33)ను ప్రత్యర్థులు దారుణంగా హతమార్చారు. ఐదుమంది బృందం మారణాయుధాలతో దాడి చేసిన దృశ్యాలు హోటల్ సీసీటీవీ ఫుటేజీల ద్వారా వెలుగులోకి వచ్చింది. కార్తీక్ తల్లి శాంతకుమారి తెలిపిన మేరకు రాత్రి 11 గంటలవేళ భోజనానికి ఫోన్ చేసి పిలిచానన్నారు. ఇంటికి వచ్చి భోజనం చేసిన వేళ ఓ యువతి ఫోన్ చేసి పిలిచారన్నారు. కార్తీక్‌తో యువతి కలసి ఉండేదని, ఇటీవల ప్రవీణ్‌తోనూ స్నేహం కొనసాగించిందన్నారు. ప్రవీణ్, కార్తీక్‌ల మధ్య గొడవ జరిగిందన్నారు. హోటల్ వద్దకు వెళ్లగానే హత్య చేశారన్నారు. కార్తీక్ హత్య విషయమై జిల్లా ఎస్పీ విష్ణువర్ధన్ మాట్లాడుతూ రెండు గ్రూపుల మధ్య గొడవ జరిగిందన్నారు. ఆర్థిక వ్యవహారాలు కానీ, యువతి వ్యవహారంలో బేధాభిప్రాయాలతో హత్య జరిగి ఉంటుందని భావిస్తున్నామని, ఆ కోణంలోనే పరిశీలిస్తున్నామన్నారు. వరుణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యిందన్నారు. కాగా ఇంట్లో భోజనం చేసి నిద్రించాలని భావిస్తున్న కార్తీక్‌ను యువతి విషయంలో రాజీ చేసుకుందామని పిలిపించి హతమార్చారని కార్తీక్ స్నేహితులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల కొంతకాలంగా ప్రవీణ్ ఎక్కడా కనిపించలేదని, అయితే ఒక్కసారిగా రాజీకి ఎందుకు ప్రయత్నించారో అర్థం కావడం లేదన్నారు. స్నేహితులను నమ్మి కార్తీక్ హత్యకు గురయ్యాడన్నారు.

చెట్టును ఢీకొన్న కారు

- ముగ్గురు యువకుల దుర్మరణం
- రామనగర జిల్లాలో ప్రమాదం

బెంగళూరు, మే 5(ఆంధ్రజ్యోతి): రామనగర జిల్లా చన్నపట్టణ తాలూకా అమ్మలదొడ్డి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి వేగంగా దూసుకెళ్లిన కారు అదుపుతప్పి చెట్టును ఢీ కొనడంతో ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు. బెంగళూరుకు చెందిన మధు (32), దీపు (22), అభి (21) మృతి చెందినవారు. ప్రమాదంలో చిరు అనే వ్యక్తికి తీవ్రగాయాలు కాగా మరో వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డారు. వీరంతా బెంగళూరులోని సుమనహళ్ళి ప్రాంతానికి చెందినవారు. ఒకే కంపెనీలో ఉద్యోగులు. ఆదివారం కబ్బాళమ్మ ఆలయం వద్ద విందులో పాల్గొనేందుకు వెళ్లారు. బెంగళూరుకు తిరిగి వస్తుండగా కారు అదుపుతప్పి చెట్టును ఢీ కొంది. అక్కూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదంలో కారు పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. విందులో పాల్గొని తిరిగి వస్తూ మృత్యువాత పడడంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం



పిడుగు పడి కాలిపోతున్న కొబ్బరిచెట్టు

బంగారపేట, మే 5(ఆంధ్రజ్యోతి): బంగారపేట తాలూకా వ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. చెరువులు, కుంటల్లోకి నీరు చేరింది. పలుచోట్ల మురుగు కాలువలలో వర్షపునీరు ప్రవహించక రోడ్లపైని చేరింది. పట్టణంలోని సేట్ కాంపౌండ్ ఇళ్లలోకి నీరు వచ్చింది. పురసభ పరిధిలోని సేట్ కాంపౌండ్‌లో తరచూ ఈ సమస్య ఉంటోంది. ఈ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ సజావుగా లేకపోవడమే సమస్యకు ప్రధాన కారణంగా ఉంటోంది. పట్టణంతో పాటు తాలూకాలోని పలు గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంది. సాయంత్రం 6 నుంచి రాత్రి 10వరకు విద్యుత్ లేక అంధకారం ఏర్పడింది. తాలూకాలోని కారహళ్ళి రోడ్డులోని అప్పొప్ప ఇంటి పక్కన ఉన్న కొబ్బరిచెట్టుపై పిడుగుపడి మంటల్లో కాలిపోయింది. దీంతో స్థానికులు బెంబేలెత్తారు.



సేట్ కాంపౌండ్ ప్రాంతంలో నిలిచిన వర్షపునీరు



జోగి గ్రామంలో బోనులో చిక్కిన కోతి

మ(పె)ంకీని పట్టేశారు..!

కంప్లి, మే 5(ఆంధ్రజ్యోతి): చిరుతను, ఎలుగుబంటిని బోను ఏర్పాటు చేసి బంధించడం సాధారణం. అయితే ఇక్కడ ఏకంగా ఓ కోతిని పట్టుకోవడానికి బోను ఏర్పాటు చేయాల్సి వచ్చింది. అయితే ఇది మామూలు కోతి కాదని, పెంకి పనులతో ప్రజలను ఇబ్బంది పెడుతోందని స్థానికులు వాపోతున్నారు. సండూరు తాలుకా పరిధిలోని జోగి గ్రామంలో కొన్ని రోజులుగా ఓ కోతి దాడి చేసి పలువురిని గాయపరించింది. విసుగెత్తిపోయిన గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు ఆదివారం బోను ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయమే కోతి బోనులో పడింది. దీంతో గ్రామప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పట్టుకున్న కోతిని అడవుల్లో వదిలేస్తామని అటవీశాఖ అధికారి మంజునాథ తెలిపారు.

కావాలని పెంచలేదు.. కలుపుమొక్కలంతే..!

- పూలకుండీలో గంజాయి మొక్కల కేసు కొట్టివేత
- సీనియర్ సిటిజన్‌కు హైకోర్టులో ఊరట

7



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.40	1,577.89
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	827	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	279	138
నీటి నిల్వ (టీఎంసీలు)	6.94	3.53

కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

● కర్మాగారాల్లో క్షయ ప్రబలే అవకాశం ● సరైన సమయంలో గుర్తిస్తే నివారణ సాధ్యం: డాక్టర్ ఇంద్రాణి

బళ్లారి సిటీ, మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కర్మాగారాల్లో పనిచేసే కార్మికులు ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని, క్షయవ్యాధిని గుర్తించి చికిత్స చేయడానికి హ్యాండ్‌హెల్డ్ ఎక్స్-రే యంత్రాలను ఉపయోగించి ప్రచారం నిర్వహిస్తున్నట్లు జిల్లా క్షయ నిర్మూలన అధికారి డాక్టర్ ఇంద్రాణి అన్నారు. సోమవారం జేఎస్‌డబ్ల్యూ స్టీల్ లిమిటెడ్ ఎనర్జీ డివిజన్‌లో జిల్లా యంత్రాంగం, జిల్లాపంచాయతీ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లాక్షయ నిర్మూలన విభాగం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, తోరణగల్లు ఆధ్వర్యంలో నిర్వహించిన 4రోజుల క్షయవ్యాధి నిర్ధారణ శిబిరంలో ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జిల్లాలోని 17 కంపెనీ ఆసుపత్రులలో నిర్వహించనున్న స్క్రీనింగ్ శిబిరాలను కంపెనీ అధికారులు.కార్మికులు సద్వినియోగం చేసుకుని బళ్లారి క్షయ రహితంగా మార్చడానికి చేతులు కలపాలని కోరారు. క్షయవ్యాధిని గుర్తించడంలో సహాయపడటానికి హ్యాండ్‌హెల్డ్ ఎక్స్-రేలను ఉపయోగించాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో సహకాలంలో పరీక్షలు జరిగేలా చూసుకోవడానికి ట్రూఎన్ఏటీ, సీబీఐఎన్ఏటీ మిషన్ల ద్వారా పరీక్షలు చేపట్టాలన్నారు. ప్రస్తుత శిబిరంలో 175 మందికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

జిందాల్ ఎనర్జీ ప్లాంట్ కార్తికేయన్ మిశ్రా మాట్లాడుతూ కార్మికులు క్షయ వ్యాధిని తనిఖీ చేయడానికి కార్యాలయానికి రావడంతో పాటు రక్తపోటు, మధుమేహం, హెచ్ఐవీ మొదలైన వాటికి పరీక్షలు చేయడం అభినందనీయమని అన్నారు. జిందాల్ బోర్డుఆఫ్ డైరెక్టర్స్, ఇందనం,ఉక్కు, పెయింట్, సిమెంట్ రంగాల్లో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులను దశలవారీగా తనిఖీ చేయడంలో సహకరిస్తామన్నారు. రెండువారాలకు పైగా దగ్గు, సాయత్రం జ్వరం, రాత్రి చెమటలు, రక్తంతో కూడిన కఫం, ఛాతీ నొప్పి, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది ఉంటే వైద్యులను సంప్రదించాలని వారు సూచించారు. జనరల్ మేనేజర్ ప్రవీణ్ కోట, ప్రతిలతా, డాక్టర్ సోనియా, క్షయ విభాగం అనిల్‌కుమార్, శేషావలి, చంద్రశేఖర్, అబిలాష, శివరాం, శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా క్షయ నిర్మూలన అధికారి డాక్టర్ ఇంద్రాణి

8న జిల్లా ప్రగతి సమీక్షా సమావేశం



కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, మే 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రగతి సమీక్ష సమావేశం మే 21, 22వ తేదీల్లో బెంగళూరులో జరగనుంది. ముఖ్యమంత్రి , ఉప ముఖ్యమంత్రుల సమక్షంలో జరగనున్న ఈ సమావేశానికి ముందే జిల్లా స్థాయి ప్రాథమిక సమావేశం ఈ నెల 8న జిల్లాకలెక్టర్ హాల్లో కలెక్టర్ అధ్యక్షతన జరగనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో పాల్గొనే అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా తెలిపారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ తుకారాం

ప్రజాసమస్యలపై తక్షణం స్పందించాలి

● ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం తగదు
● అధికారులకు ఎంపీ తుకారాం ఆదేశం

సండూరు/తోరణగల్లు, మే5(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ప్రకారం ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులు, నియమించబడిన అధికారులు ప్రజల సమస్యలపై తక్షణమ స్పందించాలని ఎంపీ తుకారాం అన్నారు. సోమవారం సండూరు పట్టణంలోని తాలూకా కార్యాలయ ఆవరణంలో నిర్వహించిన కేంద్ర, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టులపై ప్రజా విచారణ కార్యక్రమం ,తాలూకా స్థాయి ప్రజా స్పందన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ కారాల్యయాలకు ప్రజలు తిరగకుండా ఉండటమే లక్ష్యమని అధికారులు సుపరిపాలన అందించడంలో ప్రభుత్వానికి సహకరించాలన్నారు. లబ్ధిదారులకు సకాలంలో పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రజాప్రతినిధులు రాజ్యాంగ వ్యవస్థ పరిదిలోనే పని చేయాలని, రాబోమే రోజుల్లో సమగ్రఅభివృద్ధి కోసం తాలూకా స్థాయిలో జిల్లా స్థాయి దిశ సమితి సమావేశాన్ని నిర్వహించాలని ఆలోచిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి 'జనస్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సండూరు తహశీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించడానికి సండూర్ తాలూకా కార్యాలయ ప్రాంగణంలో 20కి పైగా కౌంటర్లను ప్రారంభించారు. కార్యక్రమంలో సండూర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు సిరాజ్ హుస్సేన్, కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లా ఎస్పీ శోభరాణి, జడ్పీ సీఈఓ మహమ్మద్ హారీస్, అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

కులగణన నిర్ణయం.. చరిత్రాత్మకం

● ఓబీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అయ్యాలి తిమ్మప్ప



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అయ్యాలి తిమ్మప్ప

బళ్లారి సిటీ, మే 5(ఆంధ్రజ్యోతి): ఏడు దశాబ్దాల తర్వాత కుల గణన నిర్వహించాలని కేంద్రం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని బీజేపీ విజయనగరం జిల్లా యూనిట్ ఓబీసీ వెనుకబడిన తరగతుల ఉపాధ్యక్షుడు అయ్యాలి తిమ్మప్ప అన్నారు. హొసపేటలో సోమవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమవేశంలో ఆయన మాట్లాడుతూ.. చాలా సంవత్సరాల తర్వాత ఇది దేశ ప్రస్తుత ఆర్థిక, సామాజిక, విద్యాపురోగతికి అనుబంధం కానుందన్నారు. కులగణన ఆర్థికంగా బలహీన వర్గాల మొత్తం పురోగతికి సహాయపడుతుందన్నారు. రాష్ట్రంలో కుల గణన నిర్వహిస్తామని చెప్పి సిద్దరామయ్య ప్రభుత్వం 10సంవత్సరాలు వృథా చేశారన్నారు. ఇప్పుడు కుల గణన అనేక సమస్యలను సృష్టించి సొంత పార్టీల్లో కూడా అసంతృప్తిని కలిగించిన సమయంలో కేంద్రం నిర్ణయం పరిష్కారం చూపుతుందన్నారు.జిల్లాధ్యక్షుడు సంజీవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంతోసహా దేశంలో అక్రమ వలసదారులు ఉన్నారని ఇటీవలి పహల్గామ్ ఉగ్ర దాడి ద్వారా ఇది రుజువైందని, వారిలో చాలామంది అక్కడికి వచ్చిస్థిరపడ్డారన్నారు. హంపిలో పాకిస్తాన్ జాతీయుడు దొరికాడని, అతను కశ్మీర్‌లోప్రభుత్వ ఉద్యోగి అన్నారు. అందుకే ఈరోజు జరగుతున్న దాడులు అన్నీ జరుగుతున్నాయనిన్నారు. సమావేశంలో జిల్లా అధికారి ప్రతినిధి అశోక్ జీరె, జిల్లాప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర, యువమోర్చా అధ్యక్షుడు కిచ్చడి కొట్రేశ్, మహేశ్, అనురాద తదితరులు పాల్గొన్నారు.

బీఎస్‌బీ పాఠశాలకు ఏడు నెలల గడువు

● ప్రభుత్వ స్థలం అప్పగించాల్సిందే: పురసభ సమావేశంలో ఎమ్మెల్యే గణేష్

కంప్లి, మే 5 (ఆంధ్రజ్యోతి) : పిల్లల విద్యాభ్యాసం దృష్టిలో వుంచుకుని బీఎస్‌బీ పాఠశాల ఖాళీ చేయడానికి ఏడు నెలల సమయం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తెలిపారు. పురసభ హాలులో సోమవారం ఎమ్మెల్యే జేఎన్ గణేష్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన బీఎస్‌వీ పాఠశాలను వదులుకోవడానికి నిరసనకారులు నిరాకరించడంతో మే 1న మున్సిపాల్ పాఠశాల సమీపంలోని ప్రహరీని తొలగించారు. ఈ సమయంలో పాఠశాల బోర్డు తొలగింపును నిరోధించడానికి కోర్టు నుంచి నిషేదాజ్ఞను పొందింది. ఇక్కడి మున్సిపల్ బోర్డు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాల్సి వచ్చింది. పాఠశాల స్థలాన్ని ఖాళీ చేయమని అనేక అభ్యర్థనలు ఇచ్చినప్పటికీ ప్రస్తుత మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా పాఠశాలను ఖాళీ చేసేందుకే నిశ్చయించుకుంది. పాఠశాలను దాని స్వంత ప్రదేశానికి మార్చాలని ఎమ్మెల్యే తెలిపారు. పురసభ అధ్యక్షుడు బట్టా ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి దాదాపు రూ.7.50 కోట్లు నిధులు వచ్చాయని బీఎస్‌వీ పాఠశాల వారు భూమిని ఖాళీ చేసి ఇస్తే అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. దీనికి పాఠశాల యాజమాన్యం అంగీకరించి కోర్టు నిషేధాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆఫీసర్ దురుగన్న, స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ ఉస్మాన్, సభ్యులు నాగరాజు, రామాంజినేయులు, డాక్టర్ వీఎల్ బాబు, రామాంజినేయులు, లడ్డా వన్నూరువలీ, సుదర్శన్‌రెడ్డి, మౌలా, నాగమ్మ, శాంతల, హేమావతి, సూర్యచంద్ర, సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

కరాటేతో ఆత్మరక్షణ



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న వ్యాపారవేత్త మోహన్‌రెడ్డి

బళ్లారి సిటీ, మే 5(ఆంధ్రజోతి): ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరూ ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని ప్రముఖ వ్యాపారివేత్త మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం గాంధీనగర్‌లోని శ్రీపంచాక్షరీమార్షల్ ఆర్ట్స్ ట్రస్ట్ అధ్యక్షుడు బంద్రాల్ మృత్యుంజయస్వామి బాలభారతి స్కూల్లో ఉచిత వేసవి కరాటే శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు కరాటే నేర్పించడానికి చొరవ చూపాలన్నారు. రిటైర్డ్ ఇంజనీర్ పొంపనగౌడ మాట్లాడుతూ నేటి మహిళలకు కరాటే నేర్చుకోవడం చాలా అవసరమన్నారు. మహిళలు, బాలికలు కరాటే నేర్చుకుంటే ఆత్మవిశ్వాసం పెరగడం ఖాయమన్నారు. ఉచిత కరాటే శిక్షణను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా నగరంలోని ఆదర్శ విద్యాలయంలో చదువుతున్న ట్రస్ట్‌బ్లాక్ బెల్ట్ విద్యార్థిని దేవిక పదవతరగతి పరీక్షల్లో 620మార్కులు సాధించి జిల్లాలో మూడవస్థానంలో నిలిచింది. విద్యార్థిని ట్రస్ట్ సత్కరించింది. బసవరాజప్ప, ఆనందరెడ్డి, హబ్బలగండి బసవరాజ్, సుగేరేశ్వర, వాసుదేవరాజ్,

బదిలీపై వెళ్తున్న ఎస్ఐకి సన్మానం

బళ్లారి రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లా మరమ్మనహళ్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ మౌనేష్‌రాథోడ్ బదిలీపై సింధనూరకు వెళ్తుండంతో సిబ్బంది ఘనంగా సోమ వారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ సబ్ ఇన్స్‌పెక్టర్ మరియమ్మనహళ్లి, ఎస్‌బీ కానిస్టేబుల్ విరుపాక్షి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్ఐ మౌనేష్ రాథోడ్ ను సన్మానిస్తున్న సిబ్బంది

రేపు రాయచూరుకు సీఎం

రాయచూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈనెల 7వతేదీన రాయచూరు జిల్లా పర్యటనకు రానున్నారు. ఉదయం 10 గంటలకు బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో బయలు దేరుతున్న ముఖ్యమంత్రి ఉదయం 10:40 నిమిషాలకు నగరంలోని వ్యవసాయ విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి నగరంలోని మహాత్మగాంధి స్టేడియంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యహ్నాం 3 గంటలకు జిల్లా ఉన్నతాధికారులతో సమావేశం చర్చ ఉంటుందని 4 గంటలకు తిరిగి విశ్వ విద్యాలయం హెలిప్యాడ్‌కు చేరుకుని అక్కడ నుంచి బెంగళూరుకు బయలేదేరుతారని ముఖ్యమంత్రి కార్యాలయం ప్రత్యేక అధికారి చిరంజీవి పేరున సోమవారం ప్రకటన విడుదలైంది.

బీజేపీ పాలనపై విసుగెత్తిన ప్రజలు: ఎమ్మెల్సీ వసంత్‌కుమార్

రాయచూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి ఇష్టారాజ్య పాలన సాగిస్తున్న బీజేపీ పాలకుల తీరును ప్రజాక్షేత్రంలో ఎండగడతామని కేపీసీసీ కార్యధ్యక్షుడు, ఎమ్మెల్సీ వసంత్‌కుమార్ అన్నారు. ఆదే ఉద్దేశంతో ఈ నెల 7న నగరంలోని మహాత్మగాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కల్యాణ-కర్ణాటక ప్రాంత ప్రజా ప్రతినిధుల ప్రతిఘటన సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సోమవారం నగరంలో విలేకరులతో మాట్లాడిన ఆయన ప్రతిఘటన సమావేశానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లు హాజరవుతారన్నారు. 2014లో అప్పటి యూపీఏ ప్రభుత్వం పై అసత్యపు ఆరోపణలు చేసి ప్రజలను మభ్యపెట్టి అధికారం దక్కించుకున్న నరేంద్ర మోదీ, ప్రజా రంజక పాలన చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. దరల పెరుగుదల, అదుపు లేని నిరుద్యోగం, కార్పోరేట్ అనుకూల వైఖరులతో దేశంలోని చిన్న మధ్య తరగతి పరిశ్రమలు ఖాయిదా పడగా లక్షలాది మంది యువకులు నిరుద్యోగ సమస్యనెదుర్కొంటుండడం దౌర్భాగ్యమన్నారు. దీంతోపాటు అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గుతున్నా దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించకుండా మరోవైపు వంట గ్యాస్ సిలెండర్‌లను పెంచుతూ కేంద్రం సామాన్య ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. అదే సమయంలో జీఎస్టీ పేరుతో పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడుతూ కేంద్రం కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరిస్తుండడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో మాట్లాడిన డీసీసీ అధ్యక్షుడు బసవరాజ్ ఇటగి కల్యాణ-కర్ణాటక ప్రాంతం ప్రతిఘటన సమావేశంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.



విలేకరులతో మాట్లాడుతున్న కేపీసీసీ కార్యాధ్యక్షుడు వసంత్‌కుమార్

హోసూరు జోన్



నిరసనలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

హోసూరు, మే 5(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. కశ్మీర్ పహల్గాం ఘటనను ఖండిస్తూ నగరంలోని అన్నా విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. పహల్గాం ఘటనలో అమాయకులైన పర్యాటకులు బలయ్యారన్నారు. పాకిస్థాన్‌కు మద్దతుగా ఉన్న ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదాన్ని సహించరాదన్నారు. జిల్లా అధ్యక్షుడు నారాయణ నిరసనకు నాయకత్వం వహించారు. మాజీ ఎంపీ నరసింహన్, వరదరాజన్, మునిరాజ్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కెలవరపల్లి డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో

హోసూరు రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని కెలవరపల్లి డ్యాంలో ఇన్‌ఫ్లో పెరిగింది. డ్యాం పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో 311 ఇన్‌ఫ్లో క్యూసెక్కులుగా ఉంది. రెండురోజులక్రితం వరకు 250 క్యూసెక్కులకంటే తక్కువగా ఉండగా ఆదివారం ఇన్‌ఫ్లో పెరిగింది. దీంతో కాలువల ద్వారా నీటిని అదే ప్రమాణంలో విడుదల చేస్తున్నారు.

ఆకట్టుకున్న ఇంద్రధనుస్సు

హోసూరు, మే 5(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరం సహా చుట్టుపక్కల ప్రాంతాలలో కొన్నిరోజులుగా ఎండవేడిమి అధికంగానే ఉంటోంది. అడపాదడపా వర్షపు జల్లులు కురుస్తున్నాయి. ఆదివారం వర్షం సందర్భంగా ఆకాశంలో ఏర్పడిన ఇంద్రధనస్సును వీక్షించడానికి ప్రలు ఆసక్తి చూపారు. సైన్స్ టీచర్ సేతరామన్ మాట్లాడుతూ స్ఫటికాల ద్వారా సూర్య కాంతి వక్రీభవనం చెందినప్పుడు ఇలా సంభవిస్తుందన్నారు. ఆకట్టుకున్న ఇంద్రధనస్సును ప్రజలు ఆసక్తిగా వీక్షిస్తూ ఫోటోలు తీసుకున్నారు.



ఆకాశంలో ఇంద్రధనుస్సు

అంకసముద్రంలో బీఎస్‌హెచ్‌ఎస్ బృందం పర్యటన

● వలస పక్షుల జీవనశైలిపై సమగ్ర అధ్యయనం ● పక్షుల సంతానోత్పత్తి ప్రదేశాలను గుర్తించిన అధికారులు

బళ్లారి సిటీ, మే 5(ఆంధ్రజ్యోతి): బాంబే నేచరల్ హిస్టరీ సొసైటీ (బీఎన్‌హెచ్‌ఎస్) పరిశోధకుల బృందం ఆదివారం విజయనగరం జిల్లా హగరిబొమ్మనహళ్ళి తాలూకాలోని అంకసముద్ర పక్షుల ఆభయారణ్యం, తుంగభద్ర బ్యాక్ వాటర్ ప్రాంతాలను సందర్శించింది. పట్టణంలోని గ్రీన్ హెచ్‌బీహెచ్ బృందం, ఆటవీ శాఖతో కలిసి పక్షులను , వాటి జీవవైవిధ్యాన్ని శాస్త్రీయంగా నమోదు చేయడానికి సర్వేను ప్రారంభించింది. ఈ సందర్భంగా సొసైటీ డిప్యూటీ డైరెక్టర్ సుజిత్ నర్వాడే మాట్లాడుతూ భారతదేశం, విదేశాల నుంచి వచ్చిన వందలాది స్థానిక వలస జాతుల పక్షుల ప్రాణాలను రక్షించడానికి పక్షుల ఆభయారణ్యంలో అవాసాలు, సంతానోత్పత్తి తీసుకోవాలసిన జాగ్రత్తల గురించి ఖచ్చితమైన సమాచారం నమోదు చేస్తామన్నారు. అరుదైన పక్షులకు వలయాలు వేయడం, ఉపగ్రహ ఆధారిత అధ్యయనాలు నిర్వహించడం, సైబీరియా నుంచి వలస పక్షులకు ఉన్నముప్పుపై అధ్యయనాలు నిర్వహిస్తామన్నారు. సమగ్రమైన ఖచ్చితమైన అధ్యయనం నిర్వహించి రెండు సంవ్సరాల్లోపు నివేదిక సమర్పిస్తామన్నారు. ఇక్కడ అరుదైన పక్షులు సంతానోత్పత్తి చేయడం విశేషం, కొంగలు, పెలికాన్ల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. తాలూకాలోని నారాయణ దేవరేకెరె, నకరల్ తండా సమీపంలోని బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని సందర్శించిన బృంద సభ్యులు బ్లూటెయిల్డ్‌బీ ఈటర్, ఓరియంటల్ ప్రాటిన్‌కోల్, స్మాల్‌ప్రాటిన్‌కోల్ పక్షుల గూడు, సంతానోత్పత్తి ప్రదేశాలను గుర్తించారు. జీపీఎస్ మ్యాప్‌లను రికార్డ్ చేయడం ద్వారా స్కైవాక్‌లను రక్షించడానికి తీసుకోవాల్సిన చర్యలను గ్రీన్ హెచ్‌బీహెచ్ బృంద సభ్యులకు వివరించారు.



అంకసముద్రంలో వివిధ జాతి పక్షులు (ఫైల్)

బైకును ఢీకొన్న లారీ.. యువకుడికి తీవ్రగాయాలు

బళ్లారిరూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): లారీ ఢీ కొనడంతో బైక్‌పై వెళ్తున్న యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. సోమవారం బళ్లారిరూరల్ పరిధిలోని సిరివరం పెట్రోల్ బంక్ వద్ద మోకా వైపు నుంచి వస్తున్న బైకును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో సుంకన్న తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 వాహనంలో బళ్లారి విమ్స్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. బళ్లారిరూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.
చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

రోడ్డు పనులకు ఎంపీ, ఎమ్మెల్యే భూమిపూజ

సిరుగుప్ప, మే 5 (ఆంధ్రజ్యోతి): రూ.16.29 కోట్ల వ్యయంతో పిడుగురాళ్ల గ్రామం నుంచి రారావి గ్రామం వరకు తారురోడ్డు పనులకు కొప్పాళ ఎంపీ రాజశేఖర్ యత్నాల్, ఎమ్మెల్యే బీఎం నాగరాజ సోమవారం భూమి పూజ చేశారు. తాలుకాలో వివిధ అభివృద్ధి పనులకు ఎంపీ ఎమ్మెల్యేలు పర్యటించి శ్రీకారం చుట్టారు. ఈ మార్గం చాలా రోజుల నుంచి మరమ్మత్తులకు నోచుకోక గుంతలు పడిన నేపథ్యంలో నిధులు విడుదల కావడంతో ఈ పనులు ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖరయ్య, కాంగ్రెస్ పార్టీ తాలుకా అధ్యక్షులు కరిబసప్ప, పంచాయతీ అధ్యక్షులు, సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

కులగణన పక్కాగా చేపట్టాలి

సిరుగుప్ప, మే 5(ఆంధ్రజ్యోతి): కులగణన సర్వే సక్రమంగా చేయాలని అధికారులకు తహసీల్దార్ నరసప్ప సూచించారు. సోమవారం సిరుగుప్ప పట్టణం వివేకానంద పబ్లిక్ హైస్కూలులో కులగణన సర్వేపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గానికి చెందిన కులస్తులు రిజర్వేషన్‌లో ఏబీసీడీ వర్గీకరణ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ కులాన్ని వివిధ వివరాలను తప్పనిసరిగా అందించి సహకరించాలని ఆయన సూచించారు. జిల్లా శిశు అభివృద్ధి యోజన జిల్లా నోడల్ అధికారి జలాలప్ప, అధికారులు పాల్గొన్నారు.

కత్తిపోట్లతో యువకుడి మృతి

రాయచూరు, మే 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని సియాతలాబ్‌లో నలుగురు సఫాయి కార్మికుల మధ్య జరిగిన వివాదరం హత్యకు దారి తీసింది. శివ, రమేశ్, ఓం సింగ్‌తో పాటు మరో నలుగురైదుగురు వ్యక్తులు సఫాయి కర్మచారులుగా పని చేస్తున్నారు. నలుగురి మధ్య మాటమాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో పరస్పరం దాడి చేసుకోగా అందులో చాకుతో పొడవడంతో ఓం సింగ్ అనే యువకుడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సదర్ బజార్ పోలీసులు సంఘటన స్థళానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘర్షణలో మరో యువకుడికి తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం పోలీసులు ఆయనను రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.



ఓం సింగ్ మృతదేహం

నేతలు వ్యాపార ధోరణి మానుకోవాలి

● విధాన పరిషత్ సభాపతి బసవరాజు హొరట్టి




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సభాపతి బసవరాజు వరట్టి

కంప్లి, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు వ్యాపార ధోరణి మానుకుంటేనే తమ ప్రాంతంలో అభివృద్ధి సాధ్యమవుతుందని విధాన పరిషత్ స్పీకర్ బసవరాజు హొరట్టి అభిప్రాయడ్డారు. ఆదివారం కంప్లి పట్టణంలో ఓ వివాహానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏ నాయకులైనా సరే నియోజకవర్గంలో ఇచ్చిన మాట నిలబెట్టుకుని అభివృద్ధి చేసినప్పుడే నిజమైన నాయకుడవుతారన్నారు. ప్రజాప్రతినిధులు ద్వేషాలను వదిలి ఐక్యతకు ముందుకు రావాలన్నారు. సభలో చర్చలు జరిగే సమయంలో తమ పార్టీకి నాయకులు గానీ తమకు గానీ అన్యాయం జరిగిందని నెపంతో స్పీకర్ స్థానాన్ని గుర్తించక పేపర్లు వేయడం సరికాదన్నారు. దేశద్రోహులకి శిక్ష తప్పదన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలు మోసపోకుండా తమకు వెంట వుంటూ సమాజం అభివృద్ధి చేసే నాయకులు ఎన్నుకున్నప్పుడే తమకు న్యాయం లభిస్తుందని గ్రామాల్లో పాత్రికేయులకు కూడా బస్సు పాస్ అందేలా ముఖ్యమంత్రులతో చర్చిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చాంద్‌బాషా, ఫారుక్, బట్ట ప్రసాద్, సిద్దప్ప, బాలకృష్ణ, హేమయ్య స్వామి, నాగేంద్ర, జాఫర్, శీనప్ప, నాగేంద్ర, షణ్ముఖప్ప, లడ్డా వన్నూర్‌వలీ, మస్తాన్ వలీ తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

సిగ్మండ్ ఫ్రాయిడ్ (జయంతి)



ప్రముఖ మానసిక శాస్త్రవేత్త సిగ్మండ్ ఫ్రాయిడ్ 1856 మే 6న మొరావియా (ప్రస్తుతం చెక్ రిపబ్లిక్) లో జన్మించారు. మానసిక శాస్త్ర పాఠశాలను స్థాపించారు. మానసిక విశ్లేషణ (సైకో అనాలసిస్) అంశాలపై రాసిన పుస్తకాలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. చికిత్సలో మెళకువలు, మానవ జీవిత ఉత్ప్రేరకశక్తిని వెలికి తీసే వివరణతోపాటు సాహిత్యం, న్యూరాలజీ తదితర అంశాలలో రాణించారు. 1939 సెప్టెంబరు 16న కన్నుమూశారు.

జార్జ్ ఆర్సన్ వెల్స్ (జయంతి)



జార్జ్ ఆర్సన్ వెల్స్ 1915 మే 6న జన్మించారు. అమెరికాకు చెందిన ప్రముఖ నటుడు, దర్శకుడు, స్క్రీన్ రైటర్, నిర్మాత. రేడియో, నాటకం, సినీ రంగాలలో ఆయన సేవలు చిరస్మరణీయంగా నిలిచాయి. గొప్ప దర్శకుడిగా నిలిచారు. యుద్ధం జరిగిన సంవత్సరాలలో ట్రూప్ వెరైటీ షోలలో మెజీషియన్‌గా ఎనలేని సేవలందించారు. 'ది క్రాడిల్ విల్ రాక్' సినిమా ఎంతో పేరొందింది. 1985 అక్టోబరు 10న కన్నుమూశారు.

లీలా సామ్సన్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత లీలా సామ్సన్ 1951 మే 6న తమిళనాడు రాష్ట్రం కూనూర్ ప్రాంతంలో జన్మించారు. భరతనాట్య కళాకారిణి, కొరియోగ్రాఫర్, ఇన్‌స్ట్రక్టర్, రైటర్‌గా రాణించారు. కళాక్షేత్రకు డైరెక్టర్‌గాను, సంగీత నాటక అకాడమీకి చైర్‌పర్సన్‌గాను, సెంట్రల్‌బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్‌కు చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. దేశ విదేశాలలో భరతనాట్యం ప్రదర్శనలు ఇచ్చి నృత్యానికి వన్నె తెచ్చారు. ఆమె సాధనలపై రెండు డాక్యుమెంటరీలు సంచారి, ఫ్లవరింగ్ ట్రీ వచ్చాయి. సంస్కృతి, నృత్య చూడామణి, కలైమామని, సంగీత నాటక అకాడమీ అవార్డులు అందుకున్నారు.

గగన్ నారంగ్ (పుట్టినరోజు)



హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రైఫిల్ షూటింగ్ క్రీడాకారుడు గగన్ నారంగ్ 1983 మే 6న చెన్నైలో జన్మించారు. 2006 కామన్వెల్త్ క్రీడలలో 4 బంగారు పతకాలను సాధించారు. రెండు వ్యక్తిగత పతకాలు కాగా మరో రెండు పెయిర్స్‌లో అభినవ్ బింద్రాతో కలసి సాధించారు. 2008 ఒలింపిక్స్ క్రీడలలో కూడా 3 ఈవెంట్‌లలో పాల్గొన్నా పతకం సాధించలేకపోయారు. అయితే 2012లో లండన్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో కాంస్యపతకాన్ని సాధించి చరిత్ర లిఖించారు. పద్మశ్రీ, రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న తదితర అవార్డులు అందుకున్నారు.

జూదరుల అరెస్టు

అగళి, మే 5(ఆంధ్రజ్యోతి): మండలం మధూడి గ్రామ సమీపంలో సోమవారం జూదమాడుతున్న ఐదుగురిని పట్టుకుని వారి నుంచి రూ.1,600 స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసినట్లు ఏఎస్‌ఐ బషీర్, శ్రీరాములు తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా కఠిన తప్పవన్నారు.

లారీ బోల్తా.. ఇద్దరికి గాయాలు

పెనుకొండ రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి ఆంధ్రాకు పెంకు మట్టిని తరలిస్తున్న లారీ పెనుకొండ సమీపంలోని మడకశిర పేట్లపై అదుపుతప్పి బోల్తాపడటంతో ఇద్దరు కర్ణాటక వాసులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం బాగేపల్లికి చెందిన డ్రైవర్ బాలరాజు, క్లీనర్ నరసింహమూర్తి మంగళూరు నుంచి లారీలో పెంకులు తయారుచేసే మట్టిని తాడిపత్రికి తరలిస్తున్నారు. పెనుకొండ సమీపంలోని మడకశిర పేట్లపై లారీ అదుపుతప్పి బోల్తాపడిందన్నారు. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108లో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



సూర్యప్రభ వాహనంపై కొలువుదీరిన చెన్నకేశవుడు

సూర్య, చంద్రప్రభ వాహనాలపై

ఊరేగిన చెన్నకేశవుడు

ధర్మవరం, మే 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం, సాయంత్రం చెన్నకేశవుడు సూర్య, చంద్రప్రభ వాహనాలపై ఊరేగాడు. చెన్నకేశవుడి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ఉదయం సూర్యప్రభ, సాయంత్రం చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చాడు. స్వామికి ఉభయదాతలు పూజలు చేయించారు. ఊరేగింపులో అన్నమయ్యసేవా మండలి అధ్యక్షుడు పౌరాళ్ల పుల్లయ్య బృందం సంకీర్తనలను ఆలపించింది. మంగళవారం ఉదయం సర్వభూపాల వాహనం, సింహ వాహనాలలో స్వామివారిని ఊరేగిస్తామని ఆలయ అడహాక్ చైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్, ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.




చంద్రప్రభ వాహనంపై చెన్నకేశవుడు

కన్నడ ప్రముఖ రచనలు వివిధ భాషల్లోకి అనువాదం

▸ ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): కన్నడలో పేరొందిన పుస్తకాలను ఇంగ్లిష్‌తోపాటు వివిధ భాషలలోకి తర్జుమా చేసేందుకు సంపూర్ణంగా సహకరిస్తామని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. కమలా హంపనా సాహిత్యవేదిక, చిత్రకళా పరిషత్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హంప నాగరాజయ్య రచించిన 'చారు వసంత' పుస్తకాన్ని పర్షియన్ భాషలోకి తర్జుమాను సీఎం ఆవిష్కరించారు. చిత్రకళా పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ హంప నాగరాజయ్య కన్నడలో ప్రముఖ రచయిత అని ఉన్నత వ్యక్తిత్వం కల్గినవారని కొనియాడారు. చారువసంత 16భాషలలో ప్రచురితం కాగా ప్రస్తుతం పర్షియన్‌లోనూ అనువాదం కావడం గర్వకారణమన్నారు. కన్నడ ప్రపంచంలోని అన్ని భాషలలోకి అనువాదమైతే భాషాభివృద్ధికి కారణమన్నారు. చారువసంత నాటకంగా ప్రజాదరణ పొందిందన్నారు. హంపనా దంపతులు దశాబ్దాలుగా నాకు ఆత్మీయులన్నారు. నేను సాహితీవేత్త కాకపోయినా కవులు, రచయితలతో సత్సంబంధాలు ఉన్నాయన్నారు. కన్నడ కావులు సమితికి తొలి అధ్యక్షుడు అయ్యాక కేంద్రప్రభుత్వానికి పంపే లేఖలు మినహా మిగిలిన ఎటువంటి ప్రత్యుత్తరాలను కన్నడ మినహా మరో భాషలో రాయనన్నారు. హంప నాగరాజయ్యతోపాటు చిత్రకళాపరిషత్ అధ్యక్షులు బీఎల్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం, హంప నాగరాజయ్య తదితరులు

పీఈఎస్ యూనివర్సిటీతో హెచ్‌సీఎల్ టెక్ ఒప్పందం



ఒప్పంద పత్రాలతో పీఈఎస్ వీసీ సూర్యప్రసాద్ తదితరులు

బెంగళూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ స్థాయిలో పేరొందిన టెక్ కంపెనీ హెచ్‌సీఎల్ టెక్‌తో పరిశోధనలు, ఆవిష్కరణలు, ఉద్యోగ ఆధారిత నైపుణ్యతను బలోపేతంకోసం పీఈఎస్ యూనివర్సిటీతో ఒప్పందం చేసుకుంది. సోమవారం యూనివర్సిటీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. పీఈఎస్ యూనివర్సిటీ చాన్స్‌లర్ జవహర్ దొరస్వామి మాట్లాడుతూ హెచ్‌సీఎల్ టెక్ కంపెనీతో ఒప్పందం ద్వారా విద్యార్థులకు అనుకూలం కానుందన్నారు. ఏఐ, సెమికండక్టర్, డిజిటల్ ఇంజనీరింగ్ పరిష్కారాలకు, పారిశ్రామిక రంగాలకు అవసరమైన ప్రతిభను సమకూర్చుకునేందుకు ఒప్పందం కీలకం కానుందన్నారు. హెచ్‌సీఎల్ కార్పొరేట్ వైస్‌ప్రెసిడెంట్, ఆర్ అండ్ డీ విభాగం గ్లోబల్ హెడ్ హరి సాదరహళ్ళి మాట్లాడుతూ భారత్‌లో సాంకేతికత పరిజ్ఞానం పెంపొందించడం, పరిశోధనలను ప్రోత్సహించడమే హెచ్‌సీఎల్ టెక్ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. 60 దేశాలలో 2.23 లక్షలమంది ఉద్యోగులు కల్గి ఉన్నారన్నారు. డిజిటల్ ఇంజనీరింగ్, క్లౌడ్ ఏఐ ఆధారిత రంగంలో ప్రగతికి కంపెనీ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. బెంగళూరు, నోయిడాలలో శాఖలు ఉన్నట్లు తెలిపారు.

వాసవీమాత ఆలయంలో విశేష పూజలు

ముళబాగిలు, మే 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బజార్‌రోడ్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవిజయంతిని పురస్కరించుకుని సోమవారం విశేషపూజలు, హోమాలు నిర్వహించారు. మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, విశేషపుష్పాలంకరణ చేశారు. స్థానిక కళా బృందాలు, భజన బృందాలచే భజనలు కొనసాగాయి. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఇదే సందర్భంగా పిల్లలకు విచిత్రవేషధారణ పోటీలు నిర్వహించారు. వివిధ దేవతా మూర్తులతో ఉత్సాహంగా పాల్గొన్నారు.



దేవతామూర్తుల వేషధారణలతో చిన్నారులు



విశేష అలంకరణలో అమ్మవారు

రాష్ట్రస్థాయి స్కాలర్‌షిప్‌కు ఇద్దరు విద్యార్థులు

బాగేపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఘంటంవారిపల్లి ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్‌స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు నిర్వహించి పరీక్షకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయురాలు రామసుబ్బమ్మ తెలిపారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ కాశాపుర గ్రామానికి చెందిన మహేశ్, హొసహుడ్య గ్రామానికి చెందిన యశ్వంత్ హెచ్‌ఎస్‌లు ఎంపికయ్యారన్నారు. వీరికి రానున్న నాలుగేళ్లపాటు ప్రతి సంవత్సరం రూ.12వేలు ఉపకారవేతనం లభిస్తుందన్నారు. ఈ పరీక్షకోసం కోచింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులను, ఎంపికైన విద్యార్థులను అభినందించారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన వీరు 9, 11, 12 తరగతుల్లో కనీసం 55శాతం, పదో తరగతిలో 60శాతం ఉత్తీర్ణత తప్పక సాధించాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా టీచర్ చంద్రశేఖర్, సెకండ్‌గ్రేడ్ సహాయకులు రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.





మహేశ్, యశ్వంత్

సంఘాల్లో ఐక్యత పెరగాలి

మహదేవపుర, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని సంఘాలు కలసికట్టుగా పోరాటం చేస్తేనే డిమాండ్ల సాధన సాధ్యమని భారతీయ సేవా సమితి అధ్యక్షుడు హుడి రామచంద్ర (చిన్ని) అభిప్రాయపడ్డారు. బెంగళూరు తూర్పు తాలూకా హుడిలో భారతీయ సర్వసంఘాల సమానత ఒక్కూట ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో సంఘాలు పెరిగాయని అయితే భిన్నాభిప్రాయాలు దూరం చేసుకుంటేనే పలు అంశాలు పరిష్కారం కాగలవన్నారు. సంఘం నాయకుల మధ్య ఐక్యత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ అజిత్‌కుమార్ మాట్లాడుతూ పలువురు అవినీతి అధికారుల వల్ల కనీస మౌలిక సదుపాయాలు అందడం లేదన్నారు. కన్నడ భాషను అవమానించేవారిపై పోరాటం చేసి మన భాషా సంస్కృతులు కాపాడుకోవాలన్నారు. సమావేశంలో ప్రకాశ్ పడుకోటి, ప్రశాంత్ చక్రవర్తి, దేవరాజ్ సూర్యవంశి, మునిమారప్ప, సుమారు 80కుపైగా సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో హుడి రామచంద్ర తదితరులు

పథకాలపై అవగాహన పెరగాలి

శిడ్లఘట్ట, మే 5(ఆంధ్రజ్యోతి): అవగాహన కొరత వల్లనే సౌలభ్యాలకు దూరమవుతున్నాయని కార్మిక సంఘం తాలూకా అధ్యక్షుడు దేవరమళ్ళూరు చెన్నకృష్ణప్ప అభిప్రాయపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నా అవి పూర్తిస్థాయిలో వారికి అందడం లేదన్నారు. తాలూకాలోని అబ్లూడు గ్రామపంచాయతీ తాతహళ్ళి గ్రామంలో తాలూకా ప్రొఫెసర్ నంజుండస్వామి స్థాపించిన రైతుసంఘం అధ్యక్షుడు టీకే మునిరాజు అధ్యక్షతన ఏర్పాటైన కార్మిక దినోత్సవంలో మొక్కలు నాటి మాట్లాడారు. ప్రతి కార్మికుడికి ప్రభుత్వ పథకాలు అందేలా జాగృతి కల్పించాల్సి ఉందన్నారు. సమావేశంలో కెంపనహళ్ళి ప్రకాశ్, తాతహళ్ళి మూర్తి, వలసకార్మికులు జట్టప్ప, లక్ష్మి, మడివాళప్ప, రత్నమ్మ, బసమ్మ, అరుణ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



కార్మిక దినోత్సవంలో చన్నకృష్ణప్ప తదితరులు

పరిశ్రమల వైపు అడుగులు

● భూసేకరణ పనులు వేగవంతం ● నిరుద్యోగ యువతకు ఉపాధి ● సోలార్, ఇండస్ట్రియల్ హబ్‌గా మడకశిర

మడకశిర, మే 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో అత్యంత వెనుకబడిన మడకశిర నియోజకవర్గంలో అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీల అమలుకు వేగంగా కార్యాచరణ కొనసాగుతోంది. మడకశిర ప్రాంతంలో పది రోజుల కిందట మంత్రులు అనగాని సత్యప్రసాద్, రవికుమార్, సత్యకుమార్ యాదవ్, సవిత, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పర్యటించి పరిశ్రమల కోసం స్థలాలను పరిశీలించారు. మడకశిరలో నియోజకవర్గంలో రూ. 15వేల కోట్లతో సోలార్ పార్క్ ఏర్పాటు చేయనున్నారు. దీని వల్ల రైతుల జీవితాల్లో వెలుగు రావడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మడకశిరలో త్వరలోనే వక్క మార్కెట్ ఏర్పాటుకు భూమి పూజ చేయనున్నారు. బీడు భూములకు ఆర్థికంగా వెసులుబాటు రానుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమల ఏర్పాటు కోసం రెండో విడత భూసేకరణ కూడా అధికారులు వేగవంతం చేస్తున్నారు. ఇప్పటికే సంబంధిత అధికారులు ఆ ప్రాంతాల్లో పర్యటించి భూసేకరణకు కావలిసిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు పంపించారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత మడకశిర వైపు పారిశ్రామిక వేత్తలు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మడకశిర పర్యటన సందర్భంగా.. స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు విన్నవించారు. మడకశిర మండలం ఆర్.అనంతపురం వద్ద పరిశ్రమలు నెలకొల్పేందుకు చర్యలు తీసుకుని పారిశ్రామిక కారిడార్‌గా తీర్చుదిద్దుతామని హామీ ఇచ్చారు. అందులో భాగంగానే మడకశిర ప్రాంతానికి అతి పెద్ద సోలార్‌పార్క్, డిఫెన్స్ పరిశ్రమలు రాబోతున్నట్లు మంత్రులు గొట్టి పాటి రవికుమార్, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, సవితమ్మ వెల్లడించారు. 15 రోజుల క్రితం ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, అధికారులు, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆర్.అనంతపురం వద్ద పరిశ్రమల ఏర్పాటుకు భూములను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం బీఈఎల్ మందుగుండు సామగ్రి తయారీ పరిశ్రమ ఏర్పాటు కోసం ఇప్పటి కే గౌడనహళ్లి పరిసర ప్రాంతాల్లో భూములను పరిశీలించింది.

వైసీపీ హయాంలో జాడలేని పరిశ్రమలు

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క పరిశ్రమ నెలకొల్పలేదు. ఆర్భాటంగా ప్రకటనలు చేయడం తప్ప ఆచరణ ఏమీ కనిపించలేదు. కర్ణాటక సరిహద్దు ప్రాంతమయిన మడకశిర నియోజకరవ్గంలో ఉపాధి అవకాశాలు లేక వేలాదిమంది నిరుద్యోగులు కర్ణాటక, తెలంగాణ ప్రాంతాలకు వలసలు వెళుతున్నారు. కరోనా సమయంలో స్వగ్రామాలకు వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధమవుతుండడంతో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదు సంవత్సరాలలో ఒక్క పరిశ్రమ ఏర్పాటు చేయలేదని మండిపడుతున్నారు. మడకశిర మండలం ఆర్.అనంతపురం, గౌడనహళ్లి, ఛత్రం పంచాయతీల పరిధిలో 2012లో పరిశ్రమల కోసం 1600 ఎకరాలు భూసేకరణ చేశారు. అందులో 760 ఎకరాలు ఏపీఐఐసీకి కేటాయించారు.



ఆర్. అనంతపురం వద్ద పరిశ్రమల కోసం సేకరించిన భూములు

సోను నిగమ్ వ్యాఖ్యలపై కరవే నిరసన



నిరసన తెలుపుతున్న నారాయణగౌడ తదితరులు

బెంగళూరు, మే 5(ఆంధ్రజ్యోతి): బాలీవుడ్ గాయకుడు సోనునిగమ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ కర్ణాటక రక్షణా వేదిక (కరవే) ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. కరవే అధ్యక్షుడు టీఏ నారాయణగౌడ నేతృత్వం వహించారు. ఫ్రీడంపార్కులో నిరసనలో సోనునిగమ్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. కన్నడిగులను ఉగ్రవాదులతో పోల్చి చులకనగా మాట్లాడిన సోనునిగమ్ తీరును తప్పుబట్టారు. సినీనటులు స్పందించాలని డిమాండ్ చేశారు. పెద్దసంఖ్యలో కరవే కార్యకర్తలు నిరసనలో పాల్గొన్నారు.

కావాలని పెంచలేదు.. కలుపుమొక్కలంతే..!

▸ పూలకుండీలో గంజాయి మొక్కల కేసు కొట్టివేత

▸ సీనియర్ సిటిజన్‌కు హైకోర్టులో ఊరట

బెంగళూరు, మే 5(ఆంధ్రజ్యోతి): ఇంటి ప్రాంగణంలోని పూలకుండీలో గంజాయి మొక్కలు ఉండడంతో క్రిమినల్ కేసు ఎదుర్కొంటున్న 67ఏళ్ల వ్యక్తికి హైకోర్టు ధర్మాసనం సోమవారం ఊరట కల్పించింది. 2023లో జయనగర్‌లోని చంద్రశేఖర్ అనే వ్యక్తి ఇంటి ప్రాంగణంలోని పూల కుండీలో 5గంజాయి మొక్కలను పోలీసులు గుర్తించారు. అతడిపై కేసు నమోదు చేసిన పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. చంద్రశేఖర్ తరపున వాదనలు వినిపించిన న్యాయవాది గంజాయి మొక్కలను సాగు చేసినవి కాదని, పూల కుండీలలో కలుపుమొక్కల మాదిరిగా పెరిగాయని, ఉద్దేశపూర్వకంగా వాటిని పెంచలేదన్నారు. అతడికి గంజాయి మొక్కలనేది అవగాహన లేదన్నారు. పోలీసులు చెప్పినట్లుగా 27 కేజీల గంజాయి లభించలేదన్నారు. ఇరువర్గాల వాదనలు విన్న హైకోర్టు ధర్మాసనం చార్జ్‌షీట్‌ను రద్దు చేసింది. దీంతో రెండేళ్లుగా కేసును ఎదుర్కొంటున్న చంద్రశేఖర్‌కు ఊరట లభించింది.

ఎస్‌ఎస్‌ఎల్‌సీలో 69.02 శాతం ఉత్తీర్ణత

శిడ్లఘట్ట, మే 5(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఎస్‌ఎల్‌సీలో చిక్క బళ్ళాపుర జిల్లాలో శిడ్లఘట్ట తాలూకా రెండోస్థానంలో నిలిచిందని బీఈఓ సీఏ నరేంద్ర తెలిపారు. పట్టణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తాలూకాలో 2,530 మంది పరీక్షలు రాయగా 1,746 మంది ఉత్తీర్ణులయ్యా రని, 69.02 శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి 5 శాతం ఉత్తీర్ణత పెరిగిందని తెలిపారు. తాలూకాలో బాలురకంటే బాలికలే ఎక్కువగా ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

మంత్రికి ఆత్మీయ సన్మానం



మంత్రి మహదేవప్పను సన్మానిస్తున్న దృశ్యం

బెంగళూరు, మే 5(ఆంధ్రజ్యోతి): హెచ్‌బీఆర్ లే అవుట్‌లో ఆనంద కో-ఆపరేటివ్‌శాఖను మంత్రి మహదేవప్ప లాంఛనంగా ప్రారంభించారు. బ్యాంకు అధ్యక్షులు సీ దొడ్డేరయ్య, ఉపాధ్యక్షులు కేఎస్ రుద్రయ్య, ప్రొఫెషనల్ డైరెక్టర్ సీఎస్ పుట్టరాజు, బ్యాంకు కార్యనిర్వహణాధికారి కే జనార్ధన్, డైరెక్టర్ సీఎస్ సిద్దరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రిని ఆత్మీయంగా సత్కరించి గౌతమబుద్ధుడి జ్ఞాపికను బహూకరించారు.

పది ఫలితాల్లో మ్యాక్స్‌ముల్లర్ విద్యార్థుల ప్రతిభ



ఎక్కువశాతం పొందిన విద్యార్థులు

బెంగళూరు, మే 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని మాగడి రోడ్డు హెచ్‌బీఆర్ లే అవుట్ మ్యాక్స్‌ముల్లర్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాలలో రాణించారు. దీక్ష 98.24శాతంతో 614 మార్కులు, శ్రేయ 97.76శాతంతో 611 మార్కులు, అంకుశ్ 97.44శాతంతో 609 మార్కులు, ప్రాచి జి లక్కడ్ 97.12శాతంతో 607 మార్కులు, తిప్పిరెడ్డి సోనికా 96.96 శాతంతో 606 మార్కులు సాధించారు. పాఠశాలలో 90శాతానికిపైగా 21 మంది, డిస్టింక్షన్‌లో 35 మంది, ఫస్ట్‌క్లాస్‌లో 76మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ సురేశ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సంపులో పడి వ్యక్తి మృతి

పరిగి, మే 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలో సోమవారం గంగాధర్(35)అనే వ్యక్తి నీటి సంపులో పడి మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు మధుగిరి ప్రధాన రహదారి చెర్లోపల్లి గ్రామానికి వెళ్లే దారి పక్కన మామిడితోటలో పనిచేసే గంగాధర్ అనే వ్యక్తి సంపులోపడి మృతిచెందాడు. పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్లే సమయంలో పదడుగుల సంపులో కాలుజారిపడి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి స్వగ్రామం కల్లుమర్రిగా తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ఆసుపత్రికి తరలించారు.